ప్రజాశక్తి
సోమవారం 6 జనవరి 2025
5
విజయనగరం

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు
జెఎన్‌టియుజివి జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయ వాలీబాల్ పోటీలకు జెఎన్‌టియు - జివి మహిళా జట్టు ఎంపికైంది. జెఎన్‌టియులో శనివారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో అనుబంధ కళాశాలల నుంచి విద్యార్థినులు పాల్గొన్నారు. పి.శ్రావణి, జి.హర్షిత, వి.ధాత్రి, బి.సాయిసుచిత్ర (జిఎంఆర్‌ఐటి), జి.గుణశ్రీ, బి.కావ్య (విజ్ఞాన్ ఉమెన్స్ కాలేజ్), పి.గాయత్రి (అవంతి ఇంజినీరింగ్ కళాశాల, భోగాపురం), పి.శృతి (ఇమ్మానుయేల్ ఇంజనీరింగ్ కాలేజ్), బి.మోహనలత, ఎం.సువర్ణ (జెఎన్‌టియు-జివి) కె.కీర్తి, (అవంతి కళాశాల గరివిడి), ఎ.తస్నీరాణి (డైట్ కాలేజ్) ఎంపికయ్యారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు జైపూర్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో వారు పాల్గొంటారు. వీరికి యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జయసుమ, కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు.. క్రీడా యూనిఫాం, టిఎ, డిఎలను అందించి, యూనివర్సిటీకి, కళాశాలలకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.

ఇలాంటి ఇంటింటి కుళాయిల ద్వారా నీటి సరఫరా చేయనున్నారు

అమృతధార పథకం ద్వారా ప్రజలకు ఇకపై శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఆయా నియోజకవర్గాలకు అందుబాటులో ఉన్న రిజర్వాయర్ల వద్ద భారీ స్థాయిలో నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ప్రతి గ్రామానికీ శుద్ధి జలం సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో సుమారు రూ.2 వేల కోట్లతో దీనికి సంబంధించిన డిపిఆర్‌ను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ నెలాఖరులోగా డిపిఆర్‌ను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించనున్నట్లు గ్రామీణనీటి సరఫరా విభాగం అధికారులు చెబుతున్నారు.

ఇంటింటికీ శుద్ధి జలం

- 'అమృతధార'లో ప్రజలకు అందించనున్న ప్రభుత్వం
- రిజర్వాయర్ల వద్ద భారీ నీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం
- సుమారు రూ.2 వేల కోట్లతో ప్రతిపాదనలు
- డిపిఆర్ సిద్ధం చేస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు

ప్రజాశక్తి-భోగాపురం

జిల్లాలో ప్రజలకు ఇప్పటి వరకు కేవలం ఆయా గ్రామాల్లో బోర్లు, లేదా నదులు అందుబాటులో ఉన్నచోట అక్కడ నుంచి నేరుగా తాగునీటిని సరఫరా చేసేవారు. దీంతో వివిధ రకాల వ్యాధుల బారిన పడేవారు. చాలా గ్రామాల్లో బోర్లలో నీరు పడక తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. ఒకపూట ఇస్తే రెండో పూట, ఒకరోజు ఇస్తే రెండో రోజు ఇచ్చే పరిస్థితి కూడా జిల్లాలో లేదు. ఇలాంటి సమస్యలు లేకుండా ఇక నుంచి శుద్ధి చేసిన నీటిని అమృతధార పథకం కింద ఇంటింటికి సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులను ముందుగా గుర్తించాలని అధికారులకు సూచించింది. సంబంధిత గ్రామాలకు నీటిని సరఫరా చేసేందుకు పైపులైన్ల నిర్మాణం, నీటిశుద్ధి ప్లాంట్ల నిర్మాణాలకు సుమారు రూ.2 వేల కోట్ల వ్యయమయ్యే అవకాశం ఉందని గుర్తించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు దీనికి సంబంధించిన డిటెయిల్డ్ ప్రాజెక్టును సిద్ధం చేస్తున్నారు.

ఈ రిజర్వాయర్ల వద్దే..

గ్రామాలకు శుద్ధి చేసిన నీటిని అందించేందుకు అధికారులు రిజర్వాయర్ల వద్ద భారీ నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం నెల్లిమర్ల నియోజకవర్గానికి సంబంధించి తారకరామ తీర్థసాగర్ వద్ద నీటిశుద్ధి ప్లాంటును నిర్మించనున్నారు. ఇటీవల ఇరిగేషన్ అధికారులతో కలిసి గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు పరిశీలించారు. రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాలకు మడ్డువలస రిజర్వాయరు వద్ద, గజపతినగరం, విజయనగరం గ్రామీణం, శృంగవరపుకోట నియోజకవర్గాలకు తాటిపూడి రిజర్వాయరు వద్ద, మెంటాడ మండలానికి ఆంధ్ర ప్రాజెక్టు వద్ద, బొబ్బిలి నియోజకవర్గానికి తోటపల్లి ప్రాజెక్టు వద్ద ఈ నీటిశుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తున్నారు. ఈ నెలాఖరికి డిపిఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు వద్ద నీటిశుద్ధి ప్లాంటు నిర్మాణానికి పరిశీలిస్తున్న ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు

నెల్లిమర్ల నియోజకవర్గానికి రూ.300 కోట్లతో ప్రతిపాదనలు

అమృతధార పథకం కింద ప్రతి ఇంటికీ శుద్ధి చేసిన తాగునీటిని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు తారకరామ తీర్థసాగర్ వద్ద నీటి శుద్ధి ప్లాంటు నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదనలు చేస్తున్నాం. నెల్లిమర్ల నియోజకవర్గానికి రూ.300 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. దీని నిర్మాణం పూర్తయితే ప్రతి గ్రామానికీ శుద్ధి చేసిన నీరు సరఫరా చేయొచ్చు.

– జమ్ము వైకుంఠంనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్, డిఇ, భోగాపురం

పండగ వేళల్లో చాలామంది సొంతూళ్లకు, ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇదే అదునుగా దొంగలు చోరీలకు పాల్పడుతుంటారు. వీటిని అరికట్టేందుకు ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టమ్) యాప్‌ను పోలీసులు అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా ఇళ్లకు రక్షణ కల్పించుకోవచ్చు. ప్రస్తుతం సంక్రాంతి నేపథ్యంలో విజయనగరం నగరంతోపాటు బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల నగర పంచాయతీ ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు.

– ప్రజాశక్తి, విజయనగరంకోట

ఇంటికి ఈ తాళం

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో దొంగతనాలకు చెక్ • పట్టణ ప్రజలకు రక్షణ కవచంలా మొబైల్ యాప్

పనిచేసేది ఎలా అంటే..

ఈ సౌకర్యాన్ని పొందాలంటే ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో పేరు, చిరునామా, ఫోన్ నంబర్ నమోదు చేయాలి. పోలీసులు ఓ ఐడి కేటాయిస్తారు. సంబంధిత వివరాలతో ఇతర ప్రాంతానికి వెళ్తున్నట్లు పోలీసులకు పూర్తిస్థాయిలో సమాచారం ఇవ్వాలి. ఏయే రోజుల్లో రక్షణ కావాలో తెలియజేయాలి. తద్వారా వారు స్పందించి వైర్‌లెస్ కెమెరా (సిసి కెమెరా) వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఓ యుపిఎస్‌తోపాటు డేటా కార్డును దానికి అనుసంధానిస్తారు. ఈ క్రమంలో ఇంట్లోకి ఎవరైనా వస్తే ఆ కదలికల ఆధారంగా వెంటనే ఇంటి యజమానితోపాటు స్టేషన్‌కు సమాచారం వెళ్తుంది. దీంతో ఆ ఇంటికి భద్రత లభిస్తుంది.



ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను ఉచితంగా పొందవచ్చు. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇంట్లో వెలుతురు ఉండేటట్లు ఏదో ఒక చోట బల్బు వేసి ఉంచాలి. యుపిఎస్ విద్యుత్తు లేకుండా కొన్ని గంటల వరకు మాత్రమే పనిచేస్తుంది. ఎక్కువ రోజులు ఇళ్లకు తాళం వేసి వెళ్లేవారు ఈ విషయాలపై అవగాహన కలిగి ఉండాలి. సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో హెచ్చరిక వస్తే వెంటనే అప్రమత్తం కావాలి.

పట్టణ ప్రజలు వినియోగించుకోవాలి

జిల్లాలోని విజయనగరం 1వ పట్టణ, 2వ పట్టణ, రూరల్, నెల్లిమర్ల, బొబ్బిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని మున్సిపల్ ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రజలు సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్తే, తమ ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పట్టణ ప్రజల ఆస్తులకు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ రక్షణ కవచంలా నిలుస్తుంది. దీనిపై ప్రజల్లో అవగాహన పెరగాలి.

– వకుల్ జిందాల్, ఎస్‌పి

మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

పన్నుల వసూళ్లు వేగవంతం

కార్యదర్శుల సమావేశంలో కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని రెవెన్యూ కార్యదర్శులను నగరపాలక సంస్థ కమిషనర్ మల్లి నల్లనయ్య ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆదివారం రెవెన్యూ శాఖ సిబ్బంది, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయాల వారీగా ఇప్పటివరకు వసూలు చేసిన లక్ష్యాలను సమీక్షించారు. ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తుల నుంచి మత సామరస్యాన్ని కాపాడుకుందాం

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మతోన్మాద శక్తుల నుంచి మత సామరస్యాన్ని, దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. దేశ సమైక్యత, మతసామరస్యం, రాజ్యాంగ పరిరక్షణకు సిపిఎం చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలోని ముచ్చెరువుగట్టుపై పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక అయిన భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్‌ని అవమానించడం, మసీదులపై దాడులు, దేవాలయాల కబ్జాకు ప్రయత్నిస్తున్న కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ఒక్కటే మార్గమని చెప్పారు. దేశ ఆర్థిక పరిస్థితి దిగజారిపోతుంటే మత సామరస్యానికి గండికొట్టి మతోన్మాద చర్యలకు పూనుకుంటున్నారని విమర్శించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్, పి.రమణమ్మ మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రైస్తవులు అందరూ అన్నదమ్ముల్లా కలిసి జీవిస్తున్న దేశంలో మతసామరస్యం వెల్లివిరుస్తోందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.లక్ష్మి, ఆనంద్, రామకృష్ణ, బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు

క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక లీ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్లో క్రెడాయ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాపర్టీ షోను ఆదివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ ప్రాపర్టీ షో ఏడో తేది వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకునే వారికి ప్రాపర్టీ షో మంచి అవకాశమన్నారు. ఇంటి నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్మాణం ఎలా చేపట్టాలి వంటివి ప్రాపర్టీ షో ద్వారా తెలుసుకోవచ్చన్నారు. మూడు రోజులపాటు జరిగే ప్రాపర్టీషోను జిల్లా, నగర వాసులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాష్ చంద్రబోస్, సభ్యులు పాల్గొన్నారు.

క్రెడాయ్ ప్రాపర్టీషోను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

జిల్లాలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లాలో త్వరలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించాలని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గం నిర్ణయించింది. ఆదివారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సూరిబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించాలని పెట్టిన తీర్మానాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భగవాన్ దాస్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలు అసోసియేషన్ తరుపున ఇంత వరకు నిర్వహించలేదన్నారు. ఈ ఏడాది పోటీలు నిర్వహించేందుకు కార్యవర్గం ముందుకు రావడం అభినందనీయమన్నారు.

అనంతరం ఇటీవల అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీలు విజయవంతంగా నిర్వచించి, ఎస్‌జిఎఫ్ కార్యదర్శిగా ఎన్నికైన కృష్ణంరాజును సత్కరించారు. సమావేశంలో భవిష్యత్తు కర్తవ్యాలను, చేపట్టిన కార్యక్రమాల నివేదికను కార్యదర్శి కెవిఎఎన్ రాజు ప్రవేశపెట్టారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు సంఘం జిల్లా అధ్యక్షులు సన్యాసిరాజు, అసోసియేషన్ కోశాధికారి సన్యాసినాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణంరాజు, సభ్యులను సత్కరిస్తున్న అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సంక్రాంతి పండగ వస్తున్న నేపథ్యంలో జిల్లాలో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోడి పందేలు, పేకాట నిర్వహించడం, బెట్టింగులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా, లేదా అటువంటి వ్యక్తులను ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కోడి పందేలు నిర్వహించే వారిపైనా, కోడి కత్తులను తయారు చేసే వారిపైనా, వాటిని కట్టిన వారిపైనా నిఘా పెట్టామని చెప్పారు. గతంలో ఇదే తరహా నేరాలకు పాల్పడి, అరెస్టు అయిన వ్యక్తులను స్టేషన్‌కు పిలిచి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేటు వద్ద బైండోవరు చేయాలని ఇప్పటికే పోలీస్ అధికారులకు సూచించినట్లు వెల్లడించారు.

యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయం

సాలూరు : రాష్ట్రం లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయంగా టిడిపి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆమె ప్రారంభించారు. ఈ మెగా జాబ్ మేళాకు 25 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ రోజు జరిగిన ఈ జాబ్‌మేళాకు 465 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వారిలో 111 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకుల కోసం మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ .కె ఉషశ్రీ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి సహకారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్దంగా ఉన్నామని అన్నారు. ఇలాంటి జాబ్ మేళాలు సాలూరు నియోజకవర్గ యువత ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్రాంతికి 100కు పైగా ప్రత్యేక బస్సులు

సంక్రాంతి పండగ నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు ఎపిఎస్‌ఆర్‌టిసి జిల్లా ప్రజా రవాణా అధికారి (డిపిటిఒ) సిహెచ్.అప్పలనారాయణ వెల్లడించారు. ప్రయివేటు వాహనాలకు దీటుగా, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలతోపాటు విశాఖపట్నం నుంచి 100 బస్సులకు పైగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇవన్నీ ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా, సాధారణ ఛార్జీలతో మాత్రమే నడుపుతున్నట్లు తెలిపారు. ఆర్‌టిసిని ఆదరించి, అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..

– ప్రజాశక్తి, విజయనగరంకోట

- సాధారణ ఛార్జీలతోనే ఆర్‌టిసి సర్వీలు
- ప్రయివేటు వాహనాలకు దీటుగా ప్రజా రవాణా
- ప్రజాశక్తి'తో డిపిటిఒ సిహెచ్.అప్పలనారాయణ ముఖాముఖి

సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎన్నిక బస్సులను, ఏయే ప్రాంతాల నుంచి నడుపుతున్నారు.?

సంక్రాంతి పండగ నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి ఉద్యోగులు, వలస కార్మికులు జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. అందుకే హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, విశాఖపట్నం నుంచి 100కు పైగా బస్సు సర్వీసులు నడుపుతున్నాం. ప్రధానంగా హైదరాబాద్ నుంచి 20 బస్సులు ఏర్పాటు చేశాం.

ప్రత్యేక సర్వీసులను ఎప్పటి నుంచి నడుపుతున్నారు.?

జిల్లాలోని విజయనగరం, శృంగవరపుకోట డిపోల నుంచి ఈ నెల 9వ తేదీ నుంచి స్పెషల్ బస్సులు నడుపుతున్నాం. సుదూర ప్రాంతాల నుంచి బొబ్బిలి, విజయనగరంతోపాటు ఇక్కడి నుంచి విశాఖపట్నం, అనకాపల్లికి అదనపు సర్వీసులు నడుస్తాయి.

ప్రయాణికులకు ఎలాంటి రాయితీలు కల్పిస్తున్నారు.?

సంక్రాంతి పండగ నేపథ్యంలో ఆర్‌టిసిలో అదనపు ఛార్జీలేమీ విధించడం లేదు. సాధారణ ఛార్జీలతోనే ఆర్‌టిసి బస్సులు నడుపుతున్నాం. ప్రయాణికులపై భారం ఉండదు.

కొత్త బస్సులు ఎన్ని వచ్చాయి? కాలం చెల్లినవి ఎన్ని ఉన్నాయి.?

ప్రస్తుతం జిల్లాలో ఉన్న విజయనగరం, శృంగవరపుకోట డిపోల పరిధిలో కాలం చెల్లిన బస్సులు ఏమీ లేవు. కొత్త ప్రభుత్వం వచ్చాక అల్ట్రా పల్లెవెలుగు మూడు, ఎక్స్‌ప్రెస్ ఒకటి చొప్పున హైర్ బస్సులు వచ్చాయి. అల్ట్రా డీలక్స్ ఒకటి, ఎక్స్‌ప్రెస్‌లు మూడు, సూపర్ లగ్జరీ మూడు బస్సులను ఆర్‌టిసి సమకూర్చింది. రానున్న మూడు నెలల్లో నాలుగు హైర్, మూడు ఆర్‌టిసి బస్సులు వస్తాయి.

ఆర్‌టిసిలో ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

ప్రయాణికుల భద్రతే ఆర్‌టిసి ప్రాధాన్యత. అందుకోసం సుశిక్షితులైన డ్రైవర్లను నియమిస్తున్నాం. అందుకే ఆర్‌టిసి ద్వారా ప్రయాణించేందుకు ప్రయాణికులు ప్రాధాన్యత ఇస్తారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై చర్యలు తీసుకుంటున్నాం. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే, డ్రైవర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

పూలంగి సేవను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం పూలంగి సేవ నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశక ధర్మకర్త బేబినాయన చెప్పారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ధనుర్మాసం సందర్భంగా ఉదయం 9 గంటలకు పూలంగి సేవ ప్రారంభం అవుతుందన్నారు. 50 నుంచి 60 రకాల పువ్వులతో ఆలయాన్ని, స్వామివారిని అలంకరించి పూలంగి సేవ నిర్వహిస్తామన్నారు. మంగళవారం 108 రకాల పువ్వులతో పుష్పయాగం నిర్వహిస్తామని చెప్పారు. 15వేల మంది భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పూలంగి సేవ, పుష్పయాగాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మొక్కలను పంపిణీ చేస్తున్న రామకృష్ణ

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని గ్రీన్ఎర్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు బొబ్బిలి రామకృష్ణ తెలిపారు. గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బెహరా చెరువు తూర్పు గట్టున ఫిలీసియమ్ డిసిఫియన్స్ మొక్కలను ఆదివారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య పురాణంలోని దశపుత్ర సమం వృక్షం, వృక్షో రక్షతి రక్షితః సూత్రాలు నదులు, బావుల, వృక్షాల సంరక్షణ ఆవశ్యకతను తెలియజేస్తున్నాయన్నారు. సిమ్ డైరెక్టర్ వై.విజయలక్ష్మి, విశ్రాంత బ్యాంక్ మేనేజరు వి.నాగేశ్వర రావు, ఇంటి కోటేశ్వర రావు, ఎ.శ్రీను, కె.కుమార్, మోక్షిత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంగన్‌వాడీ టీచర్స్ డే

ప్రజాశక్తి వేపాడ

వల్లంపూడి ఎస్‌సి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం అంగన్వాడీ టీచర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త ఎస్. ఈశ్వరమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యావిధానాన్ని అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు బోధిస్తున్నామని ప్రతి ఒక్క తల్లి కేంద్రానికి తన పిల్లలను పంపి బాగా చదివించుకోవాలని కోరారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న కార్యకర్తలు

దళిత మహిళపై కుల దూషణలు అన్యాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

దళిత మహిళ నగర పోలమ్మను విఆర్‌ఒ గౌరీశంకర్ కుల దూషణ చేయడం అన్యాయమని పిసిసి సభ్యులు ముప్వల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో అన్నారు. భూమి పాస్ బుక్ కోసం రెవెన్యూ కార్యాలయానికి వెళ్తున్న పారాది గ్రామానికి చెందిన పోలమ్మపై విఆర్ఒ గౌరీశంకర్ కుల దూషణలకు పాల్పడి లైంగికంగా వేధించడం దుర్మార్గమన్నారు. గౌరీశంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చర్యలు తీసుకోవడంలో విఫలం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇందిరమ్మ కాలనీలో నకిలీ ఇళ్ల పట్టాలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నకిలీ పట్టాలు సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నకిలీ పట్టాలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

నేడు ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని పుణ్యగిరి రోడ్డులో గల వర్మ ఇంటర్నెట్ సెంటర్‌లో సోమవారం నుంచి ఆధార్ నమోదు కేంద్రం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు వర్మ ఆదివారం తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఆధార్ నమోదు, మార్పులు బయోమెట్రిక్ అప్డేట్, మొబైల్ నెంబర్ లింక్ చేస్తామని ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని మండల వాసులు వినియోగించుకోవాలని కోరారు.

ఆత్మహత్య చేసుకున్న మహిళ మృతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తి గ్రామానికి చెందిన గోకాడ శ్రీదేవి(38) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె శనివారం చనిపోయారు. పంచనామా నిర్వహించి ఎస్‌కోట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం మృత దేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దేవి తెలిపారు.

100 రోజుల్లో వంద రోడ్లు ప్రారంభం

నేడు ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలోని మక్కువ, సాలూరు, పాచిపెంట, మెంటాడ మండలాల్లో 100 సీసీ రోడ్లను ఈ నెల 6, 7 తేదీల్లో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 6 నెలల్లోనే సిసి, బిటి రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆమె చెప్పారు. సాలూరు నియోజకవర్గంలో ఆగస్టులో గ్రామసభలు, అక్టోబరులో పల్లె పండగలు ఘనంగా నిర్వహించామని, ఇందులో అందరి ఆమోదంతో ప్రతిపాదించుకున్న రోడ్లును 100 రోజుల్లోనే 100 సిసి రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. ఈ వంద రోడ్ల నిర్మాణానికి అవసరమయ్యే నిధులు మంజూరు చేసిన రాష్ట్రముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన గ్రామాల్లోని ప్రజలకు అన్ని వసతులు సమకూర్చడంతో పాటు రోడ్లు నిర్మించడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శంకుస్థాపనలు చేసిన అనతి కాలంలోనే ప్రారంభోత్సవాలు చేసి అభివృద్ధికి బాటలు వేస్తున్నామని చెప్పారు. గిరి ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా విద్య, వైద్యం, తాగు, సాగునీరు, రోడ్లు అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి వివరించారు. గుంతల రోడ్లను పూడ్చే ప్రక్రియ వేగవంతం చేయడమే కాకుండా రహదారి సౌకర్యం లేని గ్రామాల్లో రహదారులు నిర్మించుకోవడం జరిగిందని తెలిపారు. సోమవారం మక్కువ మండలం కాశీపట్నంలో (పలు గ్రామాల్లోని 35 సి సి రోడ్లు), సాలూరు మండలం తోణాంలో (పలు గ్రామాల్లోని 18 సిసి రోడ్లు), 7న పాచిపెంట, మంచాడవలసలో (పలు గ్రామాల్లోని 27 సిసి రోడ్లు), మెంటాడ, పెదమేడపల్లిలో (పలు గ్రామాల్లోని 22 సిసి రోడ్లు) ప్రారంభించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

తెలుగును కాపాడే బాధ్యత భాషోపాధ్యాయులదే

ప్రజాశక్తి- బొబ్బిలి

భాషను భవిష్యత్ తరాలకు అందించే గురుతరబాధ్యత తెలుగు భాష బోధించే అధ్యాపకులపై ఉందని ప్రముఖ కవి, రచయిత కిలపర్తి దాలినాయుడు అన్నారు. ఆదివారం కారుణ్య, రోటరీ సంస్థల ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు ముగింపు వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో బొబ్బిలి నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో తెలుగు భాషను బోధించే ఉపాధ్యాయులను అభినందిస్తూ సత్కరించే కార్యక్రమాన్ని కారుణ్య, రోటరీ సంస్థల చైర్మన్ జెసి రాజు రోటరీ క్లబ్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా పాల్గొన్న దాలినాయుడు మాట్లాడుతూ రోజు రోజుకు తన ప్రాభవాన్ని కోల్పోతున్న తెలుగు భాషను బ్రతికించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. భాష మనుగడ కోల్పోతే తెలుగుజాతి మనుగడ కోల్పోతుందన్నారు. విద్యార్థులకు శతక పద్యాలు నేర్పించాలన్నారు. రచయితలు నేటి తరానికి సరిపోయే రచనలు చేయాలన్నారు. జె సి రాజు మాట్లాడుతూ రచయితలను, సాహితివేత్తలను, భాషా ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తే భాష మనుగడ సాగిస్తుందనే అభిప్రాయంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రోటరీ, కారుణ్య సంస్థల ఆధ్వర్యంలో ప్రతి ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలకు శతక పద్య పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు.

కవి, రచయిత కిలపర్తి దాలినాయుడు

తెలుగు ఉపాధ్యాయులను సత్కరిస్తున్న రోటరీ ప్రతినిధులు

భాషకు చేయూత నివ్వాలని కోరారు ప్రత్యేక అధితులుగా గౌరీ నాయుడు, ప్రసాద రావులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా 20 మంది వివిధ ఉన్నత పాఠశాలలో భాషోపాధ్యాయులుగా పని చేస్తున్న వారికి గెంబలి శ్రీనివాసరావు, శ్రీహరి, రామకృష్ణ, కృష్ణ మోహన్, డేవిడ్ జెవిక్టర్‌ల చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోటరీ, కారుణ్య సభ్యులు పాల్గొన్నారు.

రోటరీ సేవలను విస్తృతం చేయాలి

అంతర్జాతీయ రోటరీ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను విస్తృతం చేసి ప్రజలకు సేవలు అందేలా కృషి చేయాలని రోటరీ జిల్లా చైర్మన్ జెసి రాజు పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక రోటరీ కార్యాలయంలో రోటరీ సభ్యుల అసెంబ్లీ సమావేశం అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అధితిగా పాల్గొన్న జిల్లా చైర్మన్ జెసి రాజు మాట్లాడుతూ రోటరీ నిర్ణయించిన కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఈ నెల 25, 26 తేదీలలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రోటరీ జిల్లా కాన్ఫరెన్స్‌లో సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అధ్యక్షులు శ్రీనివాసన్ మాట్లాడుతూ సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగం, మహిళలు, బాలికల పై అఘాయిత్యాలు నైతిక విలువలు తదితర వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో శ్రీ హరి, రామకృష్ణ, కె నాగరాజు, లక్ష్మీ, దీపవల్లి నారాయణ మూర్తి, శంకర రావు, కృష్ణ మోహన, డేవిడ్ జె విక్టర్ తదితరలు పాల్గొన్నారు.

ఏ మతమైనా భరతమాత ముద్దు బిడ్డలం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఏ మతమైనా మనమంతా భరతమాత ముద్దుబిడ్డలమని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ అన్నారు. ఆదివారం మండలంలోని వెంకటరమణపేట ఎస్‌సి కాలనీలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతీయులం హిందూ ముస్లిం, క్రైస్తవులు ఎవరైనా భరతమాత ముద్దుబిడ్డలేనని దేశ సమైక్యత మతసామ్రస్యం వెల్లివిరియాలని స్వేచ్ఛ సమానత్వం ప్రజాస్వామ్యం ప్రగతి బాటలో ముందడుగు వేద్దామని అన్నారు. రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తూనే ఉందని దానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలను విడగొట్టేందుకు మతోన్మాద శక్తులు ఇలాంటి అగ్గి రగిలించేందుకు ప్రయత్నిస్తున్నాయని, ఈ కుట్రలను తిప్పికొడదామని పిలుపు నిచ్చారు. మనమందరం భారతీయులమేనంటూ మన స్వేచ్ఛను గౌరవిద్దామని, మతరాజకీయాలకు దూరంగా ఉందామని అన్నారు. ఈ కార్యక్రమంలో లోతేటి చంద్రావతి, బి జగ్గారావు, ఎం అప్పలకొండ, ఎం అప్పల రమణ, ఎం గోపి, ఈ మంగ, కే ప్రసాద్, జి పెంటయ్య, జి మహేష్, డి గంగమ్మ, ఎం అబద్ధం, ఆర్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

పదో రోజూ కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి-చీపురుపల్లి

మండలంలోని కర్లాం సమీపంలో ఉన్న వెంకట్రామా పౌల్ట్రీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె పదో రోజుకి చేరింది. నూతన వేతన ఒప్పందం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో వివిధ రూపాలలో కార్మికులు నిరసనలు తెలిపారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో గత పది రోజులుగా కార్మికులు నిరవధిక సమ్మెను కొసాగిస్తున్నారు. ఈ క్రమంలో వైసిపి మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్ పౌల్ట్రీ వద్ద సమ్మె చేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లి తన మద్దతుని తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ మాట్లాడుతూ పౌల్ట్రీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమ్మె కొనసాగిస్తున్నామని తెలిపారు. యాజమాన్యం మొండి వైఖరి కారణంగా చర్చలు విఫలమవుతున్నాయన్నారు. ఈ నెల 7వ తేదీన విజయనగరంలోని డిసిఎల్‌లో చర్చలు ఉన్నాయన్నారు. ఆ చర్చలు సఫలమైతే పరవాలేదని, లేదంటే అన్ని రాజకీయ పార్టీల నాయకులను, అన్ని కార్మిక, ప్రజా సంఘాలను కలసి సమ్మెకు మద్దతు కోరుతామన్నారు. చర్చలు విఫలమైతే పౌల్ట్రీ ముందు పెద్ద ఎత్తున సభ ఏర్పాటు చేస్తామని రమణ తెలిపారు. ఇప్పటికైనా కార్మికుల న్యాయమైన కోర్కెలను, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆదివారం చేపట్టిన నిరవధిక సమ్మెలో సిటియు నాయకులు అంబళ్ల గౌరినాయుడు, ఇప్పిలి గురునాయుడు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు.

నేడు మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. కేశవరావు, జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ జి.ఈరన్న సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు పదవ తరగతి నుంచి పీజీ పూర్తి చేసిన 18 నుండి 35 సంవత్సరాలు వయసు గల విద్యార్థులు అర్హులన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డుతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెమినార్ హాలు నందు హాజరు కావాలని తెలిపారు. ఈ జాబ్ మేళాకు హెటరో ల్యాబ్స్ లిమిటెడ్, సేఫ్ ఫైవ్ ప్లస్ అండ్ ప్రనవి ఈవెంట్స్ అండ్ కమ్యూనికేషన్స్ కంపెనీలు హాజరవుతాయని అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకుంటారని చెప్పారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను killuniverse.apssdc.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా రెస్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, 1 పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు జాబ్ మేళా జరుగు ప్రదేశంలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు ఈ క్రింది ఫోన్ ఫోన్ నెంబర్ 7995691295 సంప్రదించాలని తెలిపారు.

'అవంతి'లో ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక అవంతీ ఇంజనీరింగ్ కాలేజీలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై ఆబ్జెక్టివ్ టైప్ ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ ప్రతిభ పరీక్షకు చీపురుపల్లి, గరివిడి, మెరకముడదాం, గుర్ల, లావేరు, నెల్లిమర్ల మండలాల నుంచి వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలకు చెందిన 1078 మంది విద్యార్థులు హాజరయ్యారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ తెలిపారు. గరివిడి ఎంఇఒ పి.రామారావు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల నైపుణ్యతను వెలికి తీయడానికి, విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడానికి, రాబోయే రోజుల్లో పోటీ పరీక్షలను ఎదుర్కొనేటందుకు ఇటువంటి ప్రతిభ పరీక్షలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పల్లె ప్రాంతంలో ఉన్న మన అవంతి కాలేజీ సాంకేతిక ప్రగతికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ ప్రతిభ పరీక్షలో గర్భాం మోడల్ స్కూల్ విద్యార్థి వలిరెడ్డి జ్యోత్స్నకు ప్రథమ, గరివిడికి చెందిన కెవిఎస్ శివశ్యామ్‌కు ద్వితీయ, పెదనడిపల్లికి చెందిన మీసాల హరిణికు తృతీయ బహుమతులు వచ్చినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అవంతి విద్యా సంస్థల ప్రతినిధి ముత్తంశెట్టి మహేష్, వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్ కుమార్, విజయనగరం పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ విభాగం సీనియర్ లెక్చరర్ జి.భారతి, చీపురుపల్లి పాలిటెక్నిక్ కళావాల సీనియర్ లెక్చరర్ జి.స్వామినాయుడు, ఉపాధ్యాయులు, భోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో అవంతి ప్రతినిధులు

ఆదర్శ రైతుగా విశ్వనాథం ఎంపిక

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని కొత్తపెంట గ్రామానికి చెందిన రైతు చోడవరపు విశ్వనాథం ఆదర్శ రైతుగా ఎంపికయ్యాడు. తనకున్న 12 ఎకరాల భూమిలో సేంద్రియ వ్యవసాయం చేసి వరి, చెరకు, మొక్కజొన్న, టమోటా, వంగ, ఇతర పంటలను సాగు చేస్తున్నాడు. సేంద్రియ వ్యవసాయం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శ రైతుగా ఎంపిక చేసి విజయవాడలో ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గుంటూరు ఎంపీ కృష్ణదేవరాయలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సన్మానించారు. తనకు అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని ఉశ్వనాథం అన్నారు. ఆదర్శ రైతుగా బొబ్బిలి మండలానికి చెందిన విశ్వనాథం ఎంపిక అవ్వడం ఎంతో ఆనందంగా ఉందని వ్యవసాయ శాఖ ఏడి మజ్జి శ్యామసుందర్ అన్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు

ప్రజాశక్తి - తెర్లాం

పుస్తక పఠనంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతోందని గ్రంథాలయాధికారి హెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. స్థానిక హైస్కూల్ టీచర్ ప్రసన్న మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల మంచి విజ్ఞానం లభిస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్ విస్సు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదువంటే మాకిష్టం

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయాధికారి మహేష్ ఆధ్వర్యంలో చదువంటే మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు వారికి నచ్చిన కథల పుస్తకాలు చదువుకున్నారు. తెనాలి రామకృష్ణ కథలు, చందమామ కథలు బాలమిత్ర కథల పుస్తకాలను చదువుకున్నారు.

పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ఒంటరి వృద్ధులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండల కేంద్రంలోని తుమ్మికాపల్లి గ్రామంలో ఉన్న వినాయక నగర్ వద్ద ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాధ హరి కుమార్ ఆధ్వర్యంలో 45 మంది ఒంటరి వృద్ధులకు ఆదివారం చీరలు, 12 రకాల నిత్యవసరాలు పంపిణీ చేశారు. అనంతరం వారికి అన్నదానం చేశారు. విశాఖ బీసీ సెల్ ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు మాస్టర్, సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కనకాల శివ, అమ్మ సందీప్ క్యాటరింగ్ ప్రోపరేటర్ సందీప్ కుమార్ పాల్గొని వారికి చీరలను పంపిణీ చేశారు చైర్మన్ విశ్వనాధ హరికుమార్ మాట్లాడుతూ కార్యక్రమానికి విజయలక్ష్మి ఎంటర్ప్రైజెస్ ప్రొప్రైటర్ నరసింహమూర్తి, విజయనగరానికి చెందిన భవాని, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, ట్రస్ట్ సభ్యులు ఆర్థిక సాయం అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యులు నగేష్, గణేష్, ప్రసాద్, గోవింద్ రావు, తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

గణపతికి అభినందనలు

ప్రజాశక్తి - వంగర

జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యునిగా నియమితులైన మజ్జి గణపతిని రాజాం రూరల్ సిఐ హెచ్ ఉపేంద్రరావు అభినందించారు. స్థానిక పోలీస్ స్టేషన్ తనిఖీకి శనివారం సాయంత్రం వచ్చిన సిఐను మజ్జిగ గణపతి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సిఐతో గణపతి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. సిఐ ఉపేంద్ర రావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పోలీస్ సేవలు అందిస్తామని తెలిపారు. అనంతరం వంగర ఎస్ఐ. షేక్ శంకర్ గణపతిను సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన సంఘాల జెఎసి నాయకులు డద్రు రాంబాబు, రాజు, గంగలు, అప్పలస్వామి, బుజ్జి, జి. గణపతి, చిన్న రామారావు, చంటి, ఉదయ్ రామ్, దివాకర్, యమ్ రాము, టి సింహాచలం, మన్మధరావు పాల్గొన్నారు.

గణపతిని సత్కరిస్తున్న సిఐ ఉపేంద్రరావు

బొంతలకోటికి ఘన సత్కారం

ప్రజాశక్తి- గజపతినగరం

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సంపాదించుకున్న డాక్టర్ బొంతలకోటి శంకరరావును మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందించి ఘనంగా సత్కరించారు. విద్యారంగంలో వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుట్టి, దేశంలోనే ప్రథమంగా కళాబోధనకు, ఒత్తిడి, భయంలేని ఆహ్లాదకరమైన, సంగీత, సాహిత్య, వాయిద్యాపరికారాలతో పాఠ్యంశాలు రూపొందించి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని కొనియాడారు. ఐక్యరాజ్యసమితి అవార్డ్ గ్రహీతగా ఉండి, అతిపిన్న వయసులో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు పొందడం, ప్రపంచ ఐకాన్ అవార్డుకు ఎంపిక కావడం మన ప్రాంతానికి, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి లభించిన గొప్ప గౌరవమని మంత్రి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించి కళా బోధన ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లా ఖ్యాతిని ప్రపంచపుటల్లో ఇనుమడింప చేశారని హర్షం వ్యక్తం చేశారు. బొంతలకోటిని ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత ఫలితాలు సాధించాలని కోరారు.

శంకరరావును సత్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

బాధితకుటుంబాలకు నగదును అందిస్తున్న జనసేన నాయకులు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - భోగాపురం

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఇద్దరు యువకులకు జనసేన నాయకులు ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. రావాడ గ్రామానికి చెందిన గొంప సాగర్, రెడ్డి ఇద్దరు యువకులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మండల జనసేన నాయకులు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి ఆదేశాలతో ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు వందనాల రమణ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.25వేలు చొప్పున ఇద్దరికీ రూ.50వేలు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొండ రాధాకృష్ణారెడ్డి, చెల్లుబోయిన రాము, బొల్లు త్రినాథ్, లంక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు

- ఫలించిన సిపిఎం పోరాటం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కేజీపూడి గ్రామంలో సిగ్నల్ వ్యవస్థ సరిగా లేక ప్రభుత్వ కార్యాలయాలు, నిత్యవసర సరుకులు పంపిణీ, సామాజిక పింఛన్లు పంపిణీ వంటివి సక్రమంగా జరగక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు ఆ గ్రామం సమీపంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేశారు. సిగ్నెల్ వ్యవస్థ సరిగ్గా లేదని పలుమార్లు గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఇటీవల సిపిఎం నాయకులు చల్లా జగన్ ఆధ్వర్యంలో గ్రామ సభలను బహిష్కరించారు. సమావేశాలు నిర్వహించకుండా అడ్డుకున్నారు. దీంతో గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహం వద్ద బిఎస్ఎన్ఎల్ టవర్ పనులు పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధమైంది. దీంతో గిరిజనులు సిపిఎం పార్టీకి అభినందనలు తెలుపుతున్నారు.

ప్రారంభానికి సిద్ధమైన బిఎస్ఎన్ఎల్ టవర్ ఇదే

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - వేపాడ

1991-94 సంవత్సరంలో విశాఖపట్నం జిల్లా చోడవరం గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు మండలంలోని అడ్డూరులో ఉన్న రిసార్ట్స్ ఆదివారం కలిసి సందడి చేశారు. ఆ బ్యాచ్‌లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ వి. చిరంజీవి రావు కూడా ఉండటంతో స్నేహితులంతా కలిసి ఉత్సాహంగా గడిపారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

కోడి పందేలు ఆడితే చర్యలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో జాతర్ల సందర్భంగా కోడి పందేలు, పేకాట, పొట్టేలు పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బి.దేవి తెలిపారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు పెడతామని హెచ్చరించారు.

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిలు జడ్జివారి కోర్టులో

E.P. No.17/2022, OS No. 203/2009

Between :
Pasupuleti Vinayaka Rao ....DHR
And :
Koppisetty Hanumantha Rao and
Koppisetty Venkata Chinna Krishna
.....JDR

JDR No - 2
Koppisetty Venkata Chinna Krishna, S/o Hanumantha Rao, aged 47 years, Hindu, Residing at Gujjangivalasa Village, Gurla Mandal, Vizianagaram District.

పై నెంబరు అమలులో మీకు అనేక సార్లు పై కోర్టు నుండి మీకు నోటీసులు పంపినా మీరు తీసుకోనందున పై నెంబరు అమలు మీకు నోటీసు నిమిత్తం తే 22-1-2025దీకి వాయిదా వేసెరి. పై నెంబరు అమలులో మీకు ఎట్టి ఆక్షేపణలున్న ఎడల **తే 22-1-2025దీన ఉదయం 10-30 గం॥**లకు పై కోర్టులో హాజరై మనవి చేసుకొనవలెను. లేనిచో సదరు అమలు మీ పరోక్షమందు తీర్మానించబడును.

ఇట్లు
Puvvada Anjaneya Vardhan
Advocate for Plaintiff,
Vizianagaram,
Cell : 9440011823